

ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా

జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి | సోమవారం అక్టోబర్ 12,2026


## విద్యుత్ కోతలు నివారించాలని ఎమ్మెల్యే గంగుల ఆందోళన

కరీంనగర్ టౌన్ (ఈటీవీ): తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కోతలు నివారించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు, రైతులతో కలిసి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆందోళన చేపట్టారు. కరీంనగర్ మండలము దుర్శేడు గ్రామ స్టేజి వద్ద రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము రైతులకు సాగునీరు అందించక, కరెంట్ కోతలను విధిస్తోందని ఎమ్మెల్యే గంగుల ఆరోపించారు. వరి పొలాలకు సాగునీరు అందక ఇప్పటికే రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని, ఎకరానికి 30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించడంలో ప్రభుత్వము పూర్తిగా విఫలమైందన్నారు. అనవసరమైన అభివృద్ధి పనులకు డబ్బులు వృథా చేయకుండా రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.



## తెలంగాణలో 33 జిల్లాల ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తి

### కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం

**వేములవాడ అక్టోబర్ 11 (విజన్ ఆంధ్ర)**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో రాష్ట్రంలో నూతనంగా 33 జిల్లాలు ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు, వేములవాడ నియోజకవర్గ బాధ్యుడు చలిమెడ లక్ష్మీనరసింహారావు సూచనలతో వేములవాడ పట్టణంలోని నంది కమాన్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ మండల పరిధిలోని ఆరెపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు గడ్డం నరేష్ మాట్లాడుతూ, కేసీఆర్ దూరదృష్టితో ఆలోచించి పరిపాలనా సౌలభ్యం కోసం గతంలో ఉన్న పది ఉమ్మడి జిల్లాలను 33 జిల్లాలుగా ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు వంద నుంచి నూట యాభై కిలోమీటర్ల వరకు ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం జిల్లా కార్యాలయాలు సమీపంలో అందుబాటులోకి రావడంతో ప్రయాణ దూరం గణనీయంగా తగ్గిందని వివరించారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లా పోలీసు కార్యాలయం, జిల్లా విద్యాశాఖ కార్యాలయం, జిల్లా న్యాయాధికార కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులు వంటి ముఖ్యమైన సేవలు ప్రజలకు చేరువయ్యాయని అన్నారు. జిల్లాల పునర్విభజనతో ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు, వివిధ ప్రభుత్వ శాఖల సేవలను సులభంగా పొందే అవకాశం కలిగిందని తెలిపారు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా జిల్లాల ఏర్పాటు కీలక నిర్ణయమని పేర్కొంటూ, ఈ సందర్భంగా కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళ అదృశ్యంపై కేసు నమోదు

**మల్యాల, అక్టోబర్ 11(విజన్ ఆంధ్ర):**

మల్యాల మండలం నూకపల్లి గ్రామానికి చెందిన చెవులమద్ది ఎల్లవ్వ (46) శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయినట్లు ఎస్సై ఎస్. సందీప్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ దొరకక్కపోవడంతో ఆమె కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు



## సిరికొండ--కోనరావుపేట లింక్ రోడ్డుకు మంజూరు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రకటన.. త్వరలో పనులు ప్రారంభం

**మెట్ పల్లి అక్టోబర్ 11 (విజన్ ఆంధ్ర)**

సిరికొండ నుంచి కోనరావుపేట వరకు లింక్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి సిరికొండ--కోనరావుపేట, కథలాపూర్--కోనరావుపేట లింక్ రోడ్లను మంజూరు చేయాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా సభా వేదికపై స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.. సిరికొండ నుంచి కోనరావుపేట వరకు లింక్ రోడ్డు మంజూరైనట్లు ప్రకటించారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అలాగే కథలాపూర్ నుంచి కోనరావుపేట వరకు లింక్ రోడ్డు మంజూరుకు కూడా కృషి చేస్తానని



హామీ ఇచ్చారు. ఈ రోడ్లు అందుబాటులోకి వస్తే ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు, ప్రయాణ సమయం తగ్గి ప్రాంతీయ అనుసంధానం మెరుగుపడనుంది. రోడ్డు సౌకర్యం కోసం చేసిన విజ్ఞప్తికి సానుకూల స్పందన లభించడంతో స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారు గంగారెడ్డి, ఉప సర్పంచ్ జక్కని పరంధాములు, నాయకులు అనిరెడ్డి ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపుల బరితెగింపు.. అధికారుల మౌనం ఎందుకు?

పల్లెల్లో అర్ధరాత్రి దాటినా మద్యం విక్రయాల ఆరోపణలు!

ఎంఆర్‌పీకి మించి వసూళ్లంటూ ప్రచారం.. యువత భవిష్యత్తు బలిపీఠంపై!

తండాలపైనే దాడులా? గ్రామాల్లోని బెల్ట్ షాపులపై చర్యలేవి?

పేజి 2లో

## దసరా నాటికి సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల పనులు ప్రారంభం

### రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### గంభీర్‌పూర్, సిరికొండ సహకార సంఘాల నూతన పాలకవర్గాల అభినందన సభలో వెల్లడిల

**కథలాపూర్, అక్టోబర్ 11 (విజన్ ఆంధ్ర):**

రైతులకు అవసరమైన సేవలు అందిస్తూ, వారి సమస్యల పరిష్కారంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కథలాపూర్ మండలంలోని గంభీర్‌పూర్, సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నూతన చైర్మన్లు, పాలకవర్గ సభ్యుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం, రైతుల సమస్యలను పరిష్కరించడంలో సహకార సంఘాలు ప్రభుత్వానికి, రైతులకు



2లో..

## దసరా నాటికి సూరమ్మ ప్రాజెక్టు

## కుడి, ఎడమ కాలువల పనులు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి..)

మధ్య వారధిగా నిలవాలని సూచించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రైతును రాజుగా చూడాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

– దసరా నాటికి కాలువల పనులకు శ్రీకారం

కలికోట సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నిర్మాణ పనులను దసరా నాటికి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రాజెక్టు పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని, కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పరిహారం కింద సుమారు రూ.80 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కాలువలు పూర్తయితే కథలాపూర్, మేడిపల్లి, భీమారం ప్రాంతాల్లో సుమారు 43,100 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని చెప్పారు.గత పదేళ్లలో సూరమ్మ ప్రాజెక్టు గురించి మాట్లాడని బీజేపీ నాయకులు ఇప్పుడు యాత్రలు, ఆందోళనలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

– రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి, దాదాపు రూ.20,650 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందని ఆది శ్రీనివాస్ తెలిపారు.వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైతు సంక్షేమ పథకాల ద్వారా రైతులకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం పంపిణీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

– గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

కథలాపూర్ మండలంలోని అన్ని గ్రామాలకు లింక్ రోడ్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు 19 ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరుకు కృషి చేసినట్లు చెప్పారు. కథలాపూర్ మండలంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్యలు తగ్గి, వ్యవసాయ మోటార్లకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సిరికొండ గ్రామంలో మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో 49 ఇళ్లు, రెండో విడతలో మరో 43 ఇళ్లు కేటాయించినట్లు వివరించారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అప్పులు పెరిగాయని విమర్శించిన ఆది శ్రీనివాస్, ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరో పదివేల రోజులు అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గంభీర్‌పూర్ సొసైటీ చేర్మెన్ అల్లూరి దేవారెడ్డి, సిరికొండ సొసైటీ చెర్మన్ ఎండీ ముబీన్ ,సహకార సంఘాల నూతన చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు,మాజీ మండల అధ్యక్షుడు కయితీ నాగరాజు, బ్లాక్ అధ్యక్షులు ఎండీ అజీమ్ పీసీసీ మెంబర్ తోట్ల అంజయ్య, గోపిడి ధనుంజయ్,స్థానిక ప్రజాప్రతినిధులు,సర్పంచ్ లు ఉపసర్పంచులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం,ఒకరికి తీవ్ర గాయాలు:వెంకట్రావుపల్లి.

**బోయినిపల్లి అక్టోబర్ 11(విజన్ ఆంధ్ర):** బోయినిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకట్రావుపల్లి గ్రామ శివారులో అక్షయ హోటల్ సమీపంలో ఆదివారం ఉదయం వేగంగా వచ్చిన బొలెరో వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు.బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం, సిరిసిల్లకు చెందిన ఎం.డి.అజీమ్ పాషా తన పల్సర్ మోటార్ సైకిల్ (టీా 23 ఖీ 0016) పై సిరిసిల్ల వైపు వెళ్తుండగా,అక్షయ హోటల్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం (టీా 02 ఖజు 0746) డ్రైవర్ తాళ్ల తిరుపతి వాహనాన్ని అతివేగంగా,అజాగ్రత్తగా నడుపుతూ ఒక్కసారిగా కుడివైపునకు తిప్పాడు.దీంతో మోటార్ సైకిల్‌ను బొలెరో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో



అజీమ్ పాషా తలకు,ఎడమ కాలికి తీవ్ర రక్తగాయాలయ్యాయి.స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా అతడిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని భద్రకాళి ఆసుపత్రికి చేర్చారు. బాధితుడి బంధువు రషీదుల్లా ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోయినపల్లి ఎస్సై ఎన్ రమాకాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బెల్ట్ షాపుల బరితెగింపు.. అధికారుల మౌనం ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి..)







**మెట్‌పల్లి అక్టోబర్ 11 (విజన్ ఆంధ్ర):** పల్లెల్లో మద్యం ఏరులై పారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. రాత్రి వేళలు దాటినా మద్యం విక్రయాలు ఆగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. మరోవైపు మద్యం కొనుగోలుదారుల నుంచి ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు చర్చనీయాంశంగా మారుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు? మెట్‌పల్లి డివిజన్ లో అనధికారికంగా కొనసాగుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న బెల్ట్ షాపుల వ్యవహారం ఇప్పుడు ప్రజల్లో అనేక ప్రశ్నలను రేకెత్తిస్తోంది.

### నిబంధనలు కాగితాలకే పరిమితమా?

ప్రభుత్వం మద్యం విక్రయాలకు సంబంధించి నిబంధనలు విధిస్తుంటే, క్షేత్రస్థాయిలో అవి ఎంతవరకు అమలవుతున్నాయన్నదే అసలు ప్రశ్న. కొన్ని గ్రామాల్లో అర్ధరాత్రి దాటినా మద్యం అందుబాటులో ఉంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? విక్రయాలు ఎక్కడ జరుగుతున్నాయి? వాటి వెనుక ఎవరున్నారు? అనే అంశాలను ఎక్సైజ్ శాఖ తేల్చాల్సిన అవసరం ఉంది.

నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై లేదా? ఫిర్యాదులు వచ్చినప్పుడు స్పందించడం మాత్రమే కాకుండా, ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే వాస్తవాలు బయటపడే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### ఎంఆర్‌పీకి మించి వసూళ్లు.. అడిగేవారు లేరా?

మద్యం బాటిల్‌పై ఉన్న గరిష్ఠ చిల్లర ధర కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ప్రత్యేక స్టిక్కర్ల పేరుతో అదనపు ధరలు తీసుకుంటున్నారనే ప్రచారం కూడా ఉంది. అయితే ఈ ఆరోపణలకు అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

మద్యం కొనుగోలు చేసే సామాన్యుడు అదనపు ధర చెల్లించాల్సిన పరిస్థితి ఎందుకు రావాలి? ధరల ఉల్లంఘనలు జరుగుతున్నాయా లేదా అన్నది తనిఖీల ద్వారా తేల్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. అక్రమ వసూళ్లు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిరాధారమైతే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి.

### మద్యం దుకాణాల నుంచి బెల్ట్ షాపులకు సరఫరా ఎలా?

అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లయితే, ఆ కేంద్రాలకు మద్యం ఎక్కడి నుంచి వస్తోంది? లైసెన్స్ ఉన్న దుకాణాల నుంచి సరఫరా అవుతోందా? సరఫరా గొలుసులో ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ అవసరం.

గ్రామాల్లో ఎక్కడెక్కడ బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయనే సమాచారాన్ని సేకరించి, వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. కేవలం చిన్న విక్రేతలపై చర్యలు తీసుకోవడం కాకుండా, అక్రమ సరఫరా వెనుక ఉన్న వ్యవస్థ ఏదైనా ఉంటే దానిని కూడా గుర్తించాల్సిన అవసరం ఉంది.

### తండాల్లో దాడులు.. పల్లెల్లో తనిఖీలేవి?

గిరిజన తండాల్లో సారా తయారీ, విక్రయాలపై అధికారులు దాడులు నిర్వహించడం ఒకవైపు కొనసాగుతుంటే, గ్రామాల్లోని బెల్ట్ షాపులపై వస్తున్న ఆరోపణలపైనా అదే స్థాయిలో దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.చట్టాన్ని ఉల్లంఘించే వారెవరైనా నిబంధనలకు లోబడి ఉండాల్సిందే. అయితే ఒక ప్రాంతంలో చర్యలు తీసుకుంటూ, మరో ప్రాంతంలో ఆరోపణలను పట్టించుకోకపోతే ప్రజల్లో అనుమానాలు తలెత్తడం సహజం. తండాలైనా, గ్రామాలైనా చట్ట అమలులో పారదర్శకత, సమానత్వం కనిపించాలి. ఇదే ప్రజల ప్రధాన డిమాండ్.

### యువత భవిష్యత్తు.. పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఏమిటి?

మద్యం సులభంగా అందుబాటులో ఉండటం వల్ల యువతలో మద్యపాన అలవాట్లు పెరిగే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలీలు, కార్మికులు సంపాదించిన డబ్బులో అధిక భాగం మద్యానికి ఖర్చయితే కుటుంబ అవసరాలు దెబ్బతినే అవకాశం ఉంది. ఆరోగ్య సమస్యలు, అప్పులు, కుటుంబ కలహాలు వంటి పరిణామాలు కూడా ఎదురయ్యే ప్రమాదం ఉందని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.ఇది కేవలం మద్యం విక్రయాల అంశం మాత్రమే కాదు.. ప్రజారోగ్యం, కుటుంబ ఆర్థిక భద్రత, యువత భవిష్యత్తుకు సంబంధించిన సామాజిక సమస్య. అందువల్ల అక్రమ విక్రయాలపై నియంత్రణతో పాటు మద్యపాన దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించాలి!

మెట్‌పల్లి డివిజన్ పరిధిలో గల అన్ని మండలాల లోని గ్రామాల్లో అనధికారిక మద్యం విక్రయాలపై వస్తున్న ఆరోపణలను ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించాలి. గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించాలి. రాత్రివేళల్లో విక్రయాలు, అధిక ధరల వసూళ్లు, అక్రమ సరఫరా వంటి అంశాలపై ఫిర్యాదులను పరిశీలించాలి. మద్యం నాణ్యతపై అనుమానాలు ఉంటే నమూనాలను పరీక్షలకు పంపించి వాస్తవాలను నిర్ధారించాలి.

అదేవిధంగా క్షేత్రస్థాయి సిబ్బంది విధుల నిర్వహణపై పర్యవేక్షణ పెంచాలి. నిర్లక్ష్యం లేదా అక్రమాలకు సహకారం అందించారనే ఆరోపణలు ఎదురైతే విచారణ జరపాలి. తనిఖీలు, చర్యల వివరాలను పారదర్శకంగా వెల్లడిస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

### ప్రజాప్రతినిధులూ.. స్పందించండి!

ప్రజల ఆరోగ్యం, గ్రామాల సామాజిక పరిస్థితులపై ప్రభావం చూపుతున్న ఈ అంశాన్ని ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రాజకీయాలకు అతీతంగా అక్రమ మద్యం విక్రయాలపై అధికారులను ప్రశ్నించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్రజల ప్రశ్న ఒక్కటే.. బెల్ట్ షాపులపై చర్యలు ఎప్పుడు?

మెట్‌పల్లి మండలంలో బెల్ట్ షాపులు ఎక్కడెక్కడ కొనసాగుతున్నాయి? అర్ధరాత్రి దాటినా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణల్లో వాస్తవమెంత? ఎంఆర్‌పీకి మించి వసూళ్లు జరుగుతున్నాయా? అనధికారిక కేంద్రాలకు మద్యం ఎలా చేరుతోంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.తండాల్లోనే కాదు.. గ్రామాల్లోనూ తనిఖీలు జరగాలి. ఆరోపణలకే పరిమితం కాకుండా వాస్తవాలు వెలికితీయాలి. ఉల్లంఘనలు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.మెట్‌పల్లి డివిజన్ ప్రజలు కోరుతున్నది ఇదే. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ స్పందించి సమగ్ర తనిఖీలు చేపడుతుందా? లేక బెల్ట్ షాపుల వ్యవహారం ఆరోపణలకే పరిమితమవుతుందా? అన్నది వేచి చూడాలి.

# బతుకమ్మ వేళ ఆడబిడ్డలకు అశోక్ ఆత్మీయ కానుక

**స్వంత ఖర్చులతో మహిళలకు చీరల పంపిణీ.. ప్రజాసేవే తన లక్ష్యమన్న నారపాక అశోక్**

**జగిత్యాల డివిజన్ ఇంచార్జి అక్టోబర్ 11(విజన్ ఆంధ్ర ):**
సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్ ఆదివారం మంగేళ గ్రామంలో మహిళలకు తన స్వంత ఖర్చులతో చీరలను పంపిణీ చేశారు. జిల్లా స్థాయి పార్టీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తన ఎదుగుదలకు సహకరించిన గ్రామ ప్రజలతో పండుగ సంతోషాలను పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఈ పండుగ వేళ మహిళలకు చీరలు అందించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థి దశ నుంచి ప్రజా సమస్యలపై పోరాడుతూ ముందుకు సాగుతున్న తనకు ప్రజల ఆదరాభిమానాలు, కార్యకర్తల సహకారం, పెద్దల ఆశీర్వాదాలే బలమని పేర్కొన్నారు.పదవులు హోదా కోసం కాకుండా ప్రజలకు సేవ చేసేందుకు లభించే అవకాశాలని, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. పేదలు, యువత, మహిళల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, తనను ఆదరించిన ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.ప్రజలు ఇచ్చిన ఆదరణే నా ఎదుగుదలకు పునాది.. ప్రజల ఆశీర్వాదమే నా బలం.. ప్రజాసేవే నా జీవిత లక్ష్యం" అని నారపాక అశోక్ అన్నారు.ఈ కార్యక్రమంలో నారపాక దివ్య అశోక్, అద్వైత నారపాక, నారపాక లక్ష్మణ్, మోతె రాజేష్, దాసరి వెంకటేష్, నారపాక హరీష్, మోతె వంశీ, దాసరి వినోద్, దాసరి విష్ణు తదితరులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ఎస్ జి ఎఫ్ ఉషు క్రీడా పోటీలకు జెడ్ పి హెచ్ ఎస్ కొత్తపల్లి పాఠశాల విద్యార్థి ఎంపిక

**గంభీరావుపేట అక్టోబర్ 11 (విజన్ ఆంధ్ర)**
గంభీరావుపేట మండల చెందిన కొత్తపల్లి గ్రామా జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల క్రీడాకారుడు బి. సాయి క్రిష్ణ ఎస్ జి ఎఫ్ జాతీయ స్థాయి ఉషు క్రీడా పోటీలకు ఎంపిక అయ్యాడు అని పి ఈ టి బాను తెలిపారు. గత నెల 27 న ఉమ్మడి కరీంనగర్ లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో బంగారు పథకం సాధించి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయ్యాడు. అదే నెలలో 28, 29 జి హెచ్ ఎమ్ సి రెడ్ హిల్స్ నాంపల్లి క్రీడా మైదానం లో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో వెండి పథకం సాధించాడు. ఈ నెల



14 నుండి 18 వరకు జమ్మూ కాశ్మీర్ లో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొననున్న సాయి క్రిష్ణ ని డి వై ఎస్ ఒ అజ్మీరా రాందాస్, పాఠశాల హెచ్ ఎమ్ నారాయణ, పి ఈ టి బాను, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి రవీందర్, ఉమ్మడి జిల్లా ఉషు కార్యదర్శి విద్య సాగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మరియు సైమా అకాడమీ కోచ్ విక్రం, ఎమ్ ఈ ఒ గంగారాం, సమ్మర్ క్యాంప్ ఫౌండర్ చేరాలా లహరిక -నిఖిల్ గౌడ్, కొత్తపల్లి గ్రామా సర్పంచ్ నాగపురి బాలరాజ్ గౌడ్, ఉప సర్పంచ్, మండల పి ఈ టి ల బృందం,పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ,మరియు గ్రామస్తులు అభినందించారు.

# పూడూర్ జామా మస్జిద్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక.

**అధ్యక్షులుగా మహమ్మద్ అబ్దుల్ సత్తర్ .ఉపాధ్యక్షులుగా మహమ్మద్ షాదుల్లా,జనరల్ సెక్రటరీగా మహమ్మద్ నజీర్.**

**కొడిమ్యాల,అక్టోబర్ 11 (విజన్ ఆంధ్ర)**
కొడిమ్యాల మండలం పూడూర్ జామా మస్జిద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా మహమ్మద్ అబ్దుల్ సత్తర్ ,ఉపాధ్యక్షులుగా మహమ్మద్ షాదుల్లా,జనరల్ సెక్రటరీగా మహమ్మద్ నజీర్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన



అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్ సత్తర్,ఉపాధ్యక్షులు మహమ్మద్ షాదుల్లా మాట్లాడుతూ..తమపై నమ్మకంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న జామా మసీద్ కమిటీ సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.మసీద్ అభివృద్ధి,నిర్వహణకు తమ వంతు పాత్ర పోషిస్తూ కమిటీ సభ్యుల సహకారంతో ముందుకు సాగుతామని అన్నారు.మసీద్ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు.నూతన కార్యవర్గ సభ్యులు మహమ్మద్ నజీర్ (గౌరవ అధ్యక్షులు),మహమ్మద్ ఖాజ మోహినుద్దీన్ (కోశాధికారి),మహమ్మద్ యూసుఫ్ (ముఖ్య సలహాదారులు),మహమ్మద్ ఇస్మాయిల్ (ముఖ్య సలహాదారులు),మహమ్మద్ భాషు (కార్యదర్శి),మహమ్మద్ ఆల్ రాజ్ (కార్యదర్శి).మెంబర్స్ : సాజన్, షాదుల్లా, హైమద్,సాదిక్,అలీం,షబ్బీర్,జహూర్ ఎన్నికయ్యారు.

# అట్టహాసంగా ప్రారంభమైన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు.

**కమాన్ పూర్ అక్టోబర్ 11.(విజన్ ఆంధ్ర )**
కమాన్ పూర్ మండలంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం కమాన్ పూర్ మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ యూత్, సుభాష్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి లను ఏర్పాటు చేశారు. అలాగే గుండారం, జూలపల్లి, పేరా పల్లి, రొంపి కుంట, నాగారం తదితర గ్రామాల్లో మండపాల్లో దుర్గామాతలను ప్రతిష్టింపజేశారు. వేద పండితుల మంచోత్సవాల మధ్య అమ్మవార్లను



ప్రతిష్ట చేశారు. మహిళలు భారీ ఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు ఈపాటికి ఏర్పాటు చేశారు. అలాగే కమాన్ పూర్ మండల కేంద్రంలో ని చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలో శ్రీ ఆది వరహాస్వామి ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, జిల్లా వైశ్య సంఘం అధ్యక్షుడు నలమాచు ప్రభాకర్, గుండా శ్రీనివాస్, రావికంటి సతీష్, అనంతుల రాజు, తాటిపల్లి దేవయ్య, మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్, చత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు మల్యాల శేఖర్, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మల్యాల, అక్టోబర్ 11(విజన్ ఆంధ్ర):**
132 కేవీ పూడూరు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం (అక్టోబర్ 12న) పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మల్యాల ఏడీఈ ఆర్. మహేందర్ తెలిపారు. 33 కేవీ తాటిపల్లి, తక్కళ్లపల్లి, కొండగట్టు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఈ అంతరాయాన్ని గమనించి వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు

# అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన చైర్మన్ దామోదర్.

**కమాన్ పూర్ అక్టోబర్ 11(విజన్ ఆంధ్ర )**



కమాన్ పూర్ మండల కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని శ్రీ ఆది వరహస్వామి ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ ఆదివారం ప్రారంభించారు.కమానుపూర్ బస్టాండ్ లో రానవేన లక్ష్మణ్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత అమ్మవారి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి,అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివారహాదేవస్థానం చైర్మన్ శ్రీ ముస్త్యాల దామోదర్ ు డైరెక్టర్స్ కుందారపు శంకర్ ,బుస శ్రీనివాస్ గౌడ్,మల్యాల మల్లేష్,అనవేన శ్యామలసదయ్య,పెద్దపల్లి జిల్లా వైశ్య సంఘశీ అధ్యక్షుడు నల్లమచు ప్రభాకర్ ,కిషన్ రెడ్డి, మాజీ.ఎంపిటిసి ముస్యాల శ్రీనివాస్ ,మాడూరిచందు,కొలేటి శివ,సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పొలాలకు సాగునీరు అందించాలి

**లేకుంటే రైతుల పక్షాన ఆందోళన చేపడతాం: అత్తే చంద్రమౌళి**

**ముత్తారం,అక్టోబర్ 11(విజన్ ఆంధ్ర)**
ముత్తారం మండలంలోని రైతుల పంట పొలాలకు వెంటనే సాగునీరు అందించాలని మాజీ ఎంపీపీ, లక్కారం గ్రామ సర్పంచ్ అత్తే చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కమాన్‌పూర్ మండలంలోని గుండారం రిజర్వాయర్‌ను నింపి,అక్కడి నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా శుక్రవారం పేట రిజర్వాయర్‌ను సాగునీటితో నింపాలని కోరారు.అనంతరం కాలువల ద్వారా ముత్తారం మండలంలోని రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.విద్యుత్ కోతలతో బోర్లు పనిచేయకపోవడంతో పంటలకు నీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని కోరారు.సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అత్తే చంద్రమౌళి హెచ్చరించారు.



# శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం

**మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి**

**మేడిపల్లి / భీమారం, అక్టోబర్ 11 ( విజన్ ఆంధ్ర )**




మేడిపల్లి భీమారం మండల ప్రజలకు దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా, దసరా పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ మేడిపల్లి ఎస్ఐ శ్రీధర్ రెడ్డి పలు సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించేవారు తప్పనిసరి ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని కోరారు. ఆన్లైన్లో అనుమానితులు కనిపించనట్లయితే మీ గ్రామ పోలీస్ అధికారికి గాని,112 కి గాని కాల్ చేసి సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. గణేష్ విగ్రహాల ఏర్పాట్ల సందర్భంలో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకున్నారో అదే విధంగా ఇప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డీజేలకు అనుమతి లేదని తెలిపారు. పండుగ సందర్భంగా దూర ప్రాంతాలకు వెళ్లే వాళ్లు దొంగతనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సీసీ కెమెరాలు తప్పనిసరి ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. బతుకమ్మ వేడుకలలో భాగంగా మహిళలకు ఇబ్బంది కలిగిస్తే కేసు నమోదు చేస్తామని, దసరా పండుగ సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బాక్సింగ్ లో సత్తా చాటిన ప్రభుత్వ జిల్లా పరిషత్ విద్యార్థినులు.

**కమాన్ పూర్ అక్టోబర్ 11.(విజన్ ఆంధ్ర )**

కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాల కు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న జి బిందు బాక్సింగ్ పోటీలలో సత్తా చాటింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి క్రీడా పోటీలు జగిత్యాలలో జరుగుతున్నాయి. ఇందులో బాక్సింగ్ పోటీల్లో జి బిందు అనే విద్యార్థిని అత్యున్నత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించి రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. అదేవిధంగా




కమాన్ పూర్ పాఠశాల చెందిన మరొక విద్యార్థిని శశిరేఖ సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో ఆయా విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండల విద్యాధికారి ఇల్లందుల విజయకుమార్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని అభినందించారు. అలాగే ఎందుకు కృషిచేసిన ఫిజికల్ డైరెక్టర్ బండి రేణుకను బిందు శశిరేఖలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు పూర్తి .

**కమాన్ పూర్ అక్టోబర్ 11 (విజన్ ఆంధ్ర )**

కమాన్ పూర్ మండలంలో ప్రారంభమైన బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జూలపల్లి సర్పంచ్ పోల్దాసరి వనిత సాయికుమార్, పేరా పల్లి సర్పంచ్ బొంగుని సదయ్య గౌడ్ పేర్కొన్నారు. అలాగే గ్రామంలోని మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేశారు. బతుకమ్మ నిమజ్జనానికి తీసుకెళ్లడం



గాను దారి పూర్తిగా చదును చేశారు. జూలపల్లి కట్టపై గుంతల మయంగా ఉండడంతో జెసిపితో చదును చేయించారు. జూలపల్లి బతుకమ్మ ఘాట్ వద్ద స్థానిక సర్పంచ్ పోల్ దాసరి వనిత సాయికుమార్ పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం రాజమహేందర్ బొల్లంపల్లి సంతోష్ కుమార్ ఇరుగురాళ్ల రాజు మంత్రి ఇన్చార్జి చొప్పరి సంతోష్ కుమార్ బండి శంకర్ బర్ల భూమయ్య జంగాని రాజు వైద్య శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి కార్యవర్గ సంఘం,ఏకగ్రీవ ఎన్నిక:బోయినిపల్లి.

**బోయినిపల్లి అక్టోబర్11(విజన్ ఆంధ్ర):**

ఈరోజు ఆదివారం,బోయినిపల్లి మండల కేంద్రంలో జరిగిన రెడ్డి సంఘ సమావేశంలో రెండు సంవత్సరాల పాటు కొనసాగే బోయినిపల్లి మండల రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా-చల్ల శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా-గుడి శ్రీనివాస్ రెడ్డి,ముచ్చ శ్రీనివాస్ రెడ్డి,మానేరు లక్ష్మారెడ్డి,ముచ్చ శేఖర్ రెడ్డి,కార్యదర్శిగా-మిట్టపల్లి శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా -పాశం నారాయణరెడ్డి,కంకణాల పురుషోత్తం రెడ్డి,ధ్యావ నరేందర్ రెడ్డి,గోలి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా-డబ్బు వెంకట్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ,ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ..నాపై నమ్మకంతో నాకు సహకరించి, నన్ను అధ్యక్షుడిగా, ఎన్నుకున్నాందుకు అందరికీ



పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాను.కుల బాంధవుల కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని తెలిపారు.రెడ్డి సంఘం అభివృద్ధి కోసం పాటుపడతానని అన్నారు.సంఘం కార్యవర్గ సభ్యుల సమన్వయంతో ముందుకు వెళ్తానని తెలిపారు.

## పొత్కపల్లి గ్రామంలో 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని వినతి.....

**30 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు కు వినతిపత్రం అందజేసిన పొత్కపల్లి గ్రామ పాలకవర్గం.....**

**ఓదెల అక్టోబర్ 11,(విజన్ ఆంధ్ర)**



పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలో 30 పడకల ఆసుపత్రి మంజూరు కోసం ఆదివారం ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు కలిసి పొత్కపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం,గ్రామ ముఖ్య నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలకవర్గం సభ్యులు మాట్లాడుతూ పొత్కపల్లి గ్రామంలో 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణా రావు కు వినతి పత్రం అందజేశామని, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు అంబాల కొమురయ్య, ఉపసర్పంచ్ రెడ్డి రజనీకాంత్, పిఏసిఎస్ చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, మాజీ సర్పంచ్ దాసరి రాజన్న, మాజీ ఉప సర్పంచ్ వంగ శ్రీనివాస్, గడ్డం ఓదెలు,వార్డు సభ్యులు శ్రీకాంత్,రవి, లక్ష్మణ్,అనిల్ సంపత్,రవి,కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం - 2026

**జూలపల్లి అక్టోబర్ 11.(విజన్ ఆంధ్ర )**

### ZPHS వాడుకపూర్ । 2000 - 2001 బ్యాచ్

ప్రియమైన మిత్రులారా! నమస్తే...

తీపి జ్ఞాపకాల కాలేజీ రోజులు కావు మనవి... ప్రతి మూలా ఒక అనుభూతిగా మారిన పచ్చని బడి రోజులు! గురువుల తిట్లు, స్నేహితుల నవ్వులు, ఆటల మైదానంలో పరిగెత్తిన పాదాలు, బెంచ్ పై చెక్కిన పేర్లు...



కాల చక్రంలో 25 ఏళ్లు ఎలా గడిచిపోయాయో కూడా తెలియలేదు. ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో ఎవరి ప్రపంచంలో వారు బిజీగా మారిపోయాం. కానీ, మన బాల్యానికి పునాది వేసిన మన "వాడుకపూర్ ఉన్నత పాఠశాల"ని, అక్కడ మనం పంచుకున్న స్నేహాన్ని ఎప్పటికీ మరచిపోలేము కదా! అనీ

వేల్పుల సందీప్ సాయికిరణ్ తువ్వా

దినేష్ కుమార్ శారద వాణి,సంపత్

ఒక సంపత్ఆంజనేయులునరేష్ రామ్, లక్ష్మణ్ అంజన్కుమార్ నరేందర్

తిరుమల దేవేంద్ర స్వరూపా పద్మమలత రవీంద్ర చారి.

మరోసారి ఆ మధుర జ్ఞాపకాలను నెమరువేసుకోవడానికి, మన చిన్ననాటి స్నేహితులను కంటి నిండా చూసుకోవడానికి, ఒక్కరోజు మన బాధ్యతలన్నింటినీ పక్కనపెట్టి మళ్ళీ ఆనాటి బాల్యాన్ని జీవించడానికి...

"పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం"

గురు పూజోత్సవం: మనకు విద్యను, క్రమశిక్షణను నేర్పిన పూజ్యులైన ఉపాధ్యాయులకు సన్మానం.

ఆత్మీయ పరిచయాలు: ప్రొఫెషనల్ మరియు వ్యక్తిగత జీవిత విశేషాల పంచుకోలు.

జ్ఞాపకాల వేదిక: పాఠశాల రోజుల నాటి మధుర ఘట్టాల నెమరువేత.

సాంస్కృతిక కార్యక్రమాలు ఒ ఆటలు: సరదా పోటీలు మరియు విందు భోజనం.

"కాలం మనల్ని ఎంత దూరం తీసుకెళ్లినా... చిన్ననాటి స్నేహం ఎప్పటికీ మనల్ని దగ్గరగానే ఉంచుతుంది అని గుర్తు చేసుకున్నారు.

# ఘనంగా సదాశయ ఫౌండేషన్ 18 వ వార్షికోత్సవం....

**నేత్ర,శరీర,అవయవ దానాలు చేసిన దాతలకు సత్కారం....**

**సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర,శరీర అవయవ దానాలు చేసిన దాతలను సన్మానించిన ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**

**ప్రభుత్వం ద్వారా ఓదెల మండలానికి గుర్తింపు నివ్వాలి... సదాశివ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మెరుగు భీష్మాచారి**

**ఓదెల అక్టోబర్ 11,(విజన్ ఆంధ్ర)**







పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ లో ఆదివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సదాశయ ఫౌండేషన్ సభ్యులు 18 వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.సదాశయ ఫౌండేషన్ 18వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు హాజరయ్యారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు కు ఘనంగా స్వాగతం పలికి పూలమాల తో సత్కరించారు.అనంతరం ప్రభుత్వ విప్ విజయ రమణారావు మాట్లాడుతూ..... సదాశయ ఫౌండేషన్ 18 వ వార్షికోత్సవం సందర్భంగా సదాశయ ఫౌండేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.సదాశయ ఫౌండేషన్ ద్వారా నేత్ర,శరీర అవయవ దానాలు చేసిన ప్రతి ఒక్కరికి శిరస్సు వంచి నమస్సుమాంజలు తెలిపారు. ప్రజలు నేత్ర,శరీర అవయవ దానాలు చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఓదెల మండలంలోని కేవలం ఓదెల మండలంలో 280 నేత్ర దానాలు చేశారని, అందులో కేవలం ఓదెల గ్రామంలోనే 200 మంది నేత్ర దానం చేయడం కోసం కృషి చేసిన. ఓదెల నివాసి సదాశివ ఫౌండేషన్ జాతీయ నాయకులు భీష్మాచారి ని అభినందించారు. మృతి చెందిన మనిషి కళ్ళతో మరొక మనిషి ఈ ప్రపంచాన్ని చూడడం గొప్ప విషయమన్నారు. 200 మంది నేత్రదానాలు చేసిన ఓదెల గ్రామాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించాలని భీష్మాచారి కోరగా, ప్రభుత్వపరంగా నాపరంగా కచ్చితంగా మన ఓదెల గ్రామానికి సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన నేత్ర దానాలను ప్రభుత్వము గుర్తించే విధంగా నా శాయశక్తులా ప్రయత్నం చేసి సాధించుకునే వరకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం నేత్ర అవయవ దానాలు చేసిన దాతలను ఘనంగా సన్మానించారు. సదాశివ ఫౌండేషన్ 18 వ వార్షికోత్సవానికి అతిథిగా హాజరైన జిల్లా వైద్యాధికారి డాక్టర్ పవిత్ర మాట్లాడుతూ.... సదాశియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర,శరీర అవయవ దానాలు చేయడానికి అవగాహన కల్పించడం ఒక గొప్ప విషయం అని, దానికి వెలకట్టలేమన్నారు.నేత్ర, శరీర అవయవ దానం పై అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్న భీష్మచారిని అభినందించారు. సదాశివ ఫౌండేషన్ ద్వారా నేత్రదానాన్ని కావలసిన టెక్నీషియన్ ను,శరీర దానం చేయడానికి కావలసిన ఫ్రీజర్ ను, అంబులెన్స్ ను ఏర్పాటు చేయడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం సదాశివ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పాత్రికేయ మిత్రులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సదాశివ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న నేత్ర,శరీర అవయవ దానాల పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు తీసుకెళ్తున్న సదాశి ఫౌండేషన్ సభ్యులను అభినందించారు.స్పందించి సహకరిస్తున్న నేత్ర శరీర అవయవ దాన దాతలకు శిరస్సు వంచి పాదాభివందనాలు తెలిపారు.సదాశియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు సహకరించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి,సర్పంచ్ సతీష్,మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, కాల్వ శ్రీరాంపూర్ మాజీ జెడ్పిటిసి సారయ్య గౌడ్, ఓదెల పీహెచ్ డాక్టర్, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ అమర్ నాథ్, ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, మండల ఫౌండేషన్ అధ్యక్షుడు కొంద్ర వేణు,క్యాతం వెంకటేశ్వర్లు,ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, చేతన్ మల్లేశం,అల్లం సతీష్, కెప్టెన్ భాగ్యలక్ష్మి, మెరుగు దేవకి, మెరుగు కవిత, వివిధ జిల్లాల నుంచి వచ్చిన సదాశయ ఫౌండేషన్ సభ్యులు,అవయవ దాన సంస్థ ప్రతినిధులు,డాక్టర్లు,లైన్స్ క్లబ్ అధ్యక్షులు,జీవన్ లాల్ సంస్థ కు సంబంధించిన ప్రతినిధులు,డాక్టర్లు, నేత్ర,అవయవ దాతల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జూలపల్లి లో ఘనంగా దుర్గ మాత నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం

**జూలపల్లి , అక్టోబర్ 11 ( విజన్ ఆంధ్ర):**



గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో జూలపల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో దుర్గామాత 17వ వార్షికోత్సవ నవరాత్రి ఉత్సవాలలో ప్రారంభించారు. ఆదివారం ఉదయం మేళ తాళాలతో అమ్మవారిని తీసుకువచ్చి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఆలయ అర్చకులు ఉద్దండ నవీన్ కుమార్ ప్రతిష్టించారు. అనంతరం అమ్మవారు బాల త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వగా మాలదారులు,కంకణదారులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కాగా పూజ అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో అందె శివ ప్రసాద్ కొండా కొండ రాంప్రసాద్ శంకర్ చారి విద్యా సాగర్ వెంగళ శ్రీనివాస్ వైద్య నందికిషోర్ కొండ శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

**మల్యాల, అక్టోబర్ 11(విజన్ ఆంధ్ర):**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు సందర్భంగా ఆలయంలోని అమ్మవారు భక్తులకు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.



నవరాత్రుల ప్రారంభం సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవారి మూలమూర్తికి పంచామృతాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించి, శాస్త్రోక్తంగా కుంకుమార్చన పూజలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# వేములవాడ రూరల్ ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

## అధ్యక్షుడిగా రోమాల ప్రవీణ్ ఏకగ్రీవ ఎన్నిక - తక్కువ ధరలకే ఇసుక అందిస్తామని హామీ

**వేములవాడ, అక్టోబర్ 11( విజన్ ఆంధ్ర ):**



వేములవాడ రూరల్ మండల ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలోఏకగ్రీవగాఎన్నుకున్నారు. నూకలమర్రి గ్రామానికి చెందిన రోమాల ప్రవీణ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రోమాల ప్రవీణ్ మాట్లాడుతూతనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులకు ధన్యవాదాలుతెలిపారు.వేములవాడ రూరల్ మండలంలో అభివృద్ధి పనులకు, ప్రజల నిత్య అవసరాలకు ట్రాక్టర్ యజమానులంతా ఐక్యంగా ఉంటామని అన్నారు.ప్రభుత్వం చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు అవసరమైన ఇసుక, ఇతర సామగ్రిని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు భారం కాకుండా అతి తక్కువ ధరలకే అందిస్తామని హామీ ఇచ్చారు.ట్రాక్టర్ యజమానుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడుతానని తెలిపారుఈ కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యుల వివరాలను వెల్లడించారు.గౌరవ అధ్యక్షుడిగా రంగు వెంకటేష్, అధ్యక్షుడిగా రోమల ప్రవీణ్ బాధ్యతలు చేపట్టగా, ఉపాధ్యక్షులుగా గుడిసె శంకర్, కచ్చు పరశురాం ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎడపల్లి విష్ణు, క్యాషియర్గా జాగీరి సురేష్, సంయుక్త కార్యదర్శులుగా శివనక సతీష్, ఎడపల్లి నాగరాజు బాధ్యతలు స్వీకరించారుఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# మండపాల లో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు

**గంభీరావుపేట అక్టోబర్ 11 (విజన్ ఆంధ్ర)**



దుర్గామాత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గంభీరావుపేట మండలంలో ఆదివారం దుర్గామాతను డప్పు చప్పులు కోలాటాల మధ్య దుర్గామాతను ఊరేగింపుగా మండపాలకు తీసుకువెళ్లి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు.

# నాయక పోడ్ సేవా సంఘం జగిత్యాల జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**జిల్లా అధ్యక్షుడిగా మంగి నలిన్.. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొమ్మడి రాజేష్**

**సంఘ అభివృద్ధికి, భవనాల నిర్మాణానికి కృషి చేస్తా: రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గాండ్ల రామచందర్**

**మెట్‌పల్లి, అక్టోబర్ 11 (విజన్ ఆంధ్ర):**
జగిత్యాల జిల్లా నాయక పోడ్ సేవా సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం మెట్‌పల్లిలోని రామాలయం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గాండ్ల రామచందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ఆధ్వర్యంలో జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు నూతన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## జగిత్యాల జిల్లా నూతన కార్యవర్గం

జగిత్యాల జిల్లా నాయక పోడ్ సేవా సంఘం అధ్యక్షుడిగా మంగి నలిన్, ఉపాధ్యక్షులుగా దివ్వి రాజు, గంప గంగారం, ఏదుల మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొమ్మడి రాజేష్, కార్యదర్శిగా బట్టిపెల్లి రాజు, కోశాధికారిగా మంగి శేషాద్రి ఎన్నికయ్యారు. సాంస్కృతిక కార్యదర్శులుగా మాదాడి దీపక్, సంద్రుకు ధర్మేందర్, సంయుక్త కార్యదర్శులుగా గోపి హరీష్, బట్టిపెల్లి గోపాల్‌తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## సంఘ సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గాండ్ల రామచందర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా నాయక పోడ్ సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉండి తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



సంఘ సభ్యుల మద్దతు, సహకారంతో సంఘ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గ ఎమ్మెల్యేల సహకారంతో సంఘ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. సంఘ ఐక్యతను బలోపేతం చేసుకుంటూ, సభ్యుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గాండ్ల రామచందర్‌ను జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి కొమ్ము రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెట్టు పెద్ద భూమయ్య, మల్లేష్, శేఖర్, రాజు, విట్టల్, భూమయ్య, గంగాధర్, వేణు, జిల్లా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిని కాపాడాల్సిన అధికారులే అక్రమ కట్టడాలకు అండగా ఉంటారా?

**ఆర్జీ-3 జనరల్ మేనేజర్, ఎస్టేట్ అధికారిపై సీఎండీ, డైరెక్టర్ (పా)కు ఫిర్యాదు చేస్తాం బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్**



రామగిరి అక్టోబర్ 11(విజన్ ఆంధ్ర )సింగరేణి సంస్థను కాపాడాల్సిన బాధ్యత కలిగిన కొందరు అధికారులు తమ విధులను పక్కనపెట్టి రాజకీయ వ్యవహారాల్లో తలదూరుస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. రామగుండం-3 ఏరియాలోని జనరల్ మేనేజర్, ఎస్టేట్ అధికారుల పనితీరుపై ఉన్న అనుమానాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వీరిపై సింగరేణి సీఎండీ, డైరెక్టర్ (పా)కు అధికారికంగా ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ జనరల్ మేనేజర్ , మీకు రాజకీయాలపై అంత ఆసక్తి ఉంటే రాజకీయాల్లోకి వెళ్లండి! కానీ సింగరేణి సంస్థలో అధికారిగా ఉంటూ సంస్థ ప్రయోజనాలను, కార్మికుల హక్కులను విస్మరించకండి. సింగరేణి ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు. ఇది వేలాది కార్మికుల శ్రమతో నడిచే సంస్థ.మా డిమాండ్ ఒక్కటే---ఆర్జీ-3లోని అక్రమ నిర్మాణాలు, అనుమతులు, ఎస్టేట్ వ్యవహారాలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలి. తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై సంస్థ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.సింగరేణి సంస్థను కాపాడే వరకు, కార్మికులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. ప్రశ్నిస్తే నోటీసులు పంపిస్తారా దానికి జనరల్ మేనేజర్ జవాబు చెప్పాలి తప్పు చేయనప్పుడు భయమెందుకు తప్పు చేసినట్లయితే గుడిలో ప్రమాణం చేస్తారా ఇద్దరు సెక్యూరిటీ ం అ ు జూ ఎ. లకు ఎందుకు సస్పెండ్ లెటర్లు ఇచ్చారు చెప్పాలి వారు ఏం తప్పు చేశారు సింగరేణి సంస్థలు దొంగతనాలు అవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదు జనరల్ మేనేజర్ అధికారుల మీద దాడులు జరుగుతుంటే మీరు అప్పుడు మీరు ఎందుకు చట్టపరమైన కేసులు నమోదు చేయలేదు ప్రైవేట్ వ్యక్తులకు ఎందుకు సపోర్ట్ చేశారు మేము నిజం చెప్తే నోటీసులు పంపిస్తారా అప్పుడు మాట్లాడనీ మీరు కార్మికుల పైన ప్రైవేట్ వ్యక్తులు దాడి చేస్తే మీకు సంతోషమా కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి నాయకులు అందరికీ నోటీసులు పంపిస్తారా ఇది ఎక్కడి న్యాయం అవసరమైన ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, విచారణ పురోగతిని ప్రజల ముందుంచుతాం.

# బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో కొలువుదీరిన అమ్మవారు

**ముత్తారం,అక్టోబర్ 11(విజన్ ఆంధ్ర)**
మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి దేవాలయ ఆవరణలో,పాత హనుమాన్ దేవాలయంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
పెద్దమ్మతల్లి దేవాలయంలో,శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు.అనంతరం ప్రత్యేక



హారతులు,పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, శ్రీ ఆంజనేయస్వామి భక్తులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణా రావు

**జూలపల్లి అక్టోబర్ 11.(విజన్ ఆంధ్ర )**





జూలపల్లి మండల కేంద్రంలో ఆదివారం తన సోదరులు స్వర్గీయ చింతకుంట సుధాకర్ రావు జ్ఞాపకార్థం నిర్వహించే జూలపల్లి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జూలపల్లి వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కొమ్మ పోశాలు,సింగిల్ విండో చైర్మన్ లు లోక జలపతి రెడ్డి, దూళికట్ట సింగిల్విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాలరావు,డైరెక్టర్లు, బీసీ సెల్ మండల అధ్యక్షులు బండి స్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొజ్జ శ్రీనివాస్, ఉప సర్పంచ్ కొప్పుల మహేష్,వార్డు సభ్యులు ఎదుల్ల కనకయ్య,బొంగాని వనిత రమేష్,కాంగ్రెస్ సోషల్ మీడియా మండల అధ్యక్షులు కొప్పుల శ్రావణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,పలు గ్రామాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు,యువకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అబ్బాపూర్ లో బెల్ట్ షాపులకు బ్రేక్

**మద్యం విక్రయాలు అక్టోబర్ 10 నుండి బంద్**

**జూలపల్లి అక్టోబర్ 11.(విజన్ ఆంధ్ర )**



జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో కిరాణా షాపులు,బెల్ట్ షాపులలో మద్యం అమ్మకాలు జరుగుతున్న క్రమంలో మహిళలు యువతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఇటీవల జరిగిన పలు సంఘటనలు గ్రామపంచాయతీ పాలకవర్గం దృష్టికి గ్రామ మహిళలు,ప్రజలు తీసుకురాగా పంచాయతీ పాలకవర్గం ఇటీవల జరిగిన గ్రామసభలో ఈ మేరకు నిర్ణయం తీసుకొని గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా క్రయవిక్రయాలు జరిపిన పంచాయతీ పాలకవర్గం నియమ నిబంధనలు ఉల్లంఘించిన రూపాయలు ఐదువేలు జరిమానా విధిస్తూ తీర్మానం చేశారు.తీర్మానం కాపీని ఆదివారం పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో జూలపల్లి ఎస్సై బుద్దే మల్లేష్ కు తీర్మానం ప్రతి అందించి చట్టపర చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండే వెంకటేశ్వర్లు,వార్డు సభ్యులు పబ్బాల శంకరయ్య,బొడిగె లక్ష్మణ్,షేరి నర్సింగం,నాయకులు అమరాజి రాజకుమార్,గాండ్ల రాజు,మారం నాగరాజు,పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి,కొమ్మ రాజేశం,టెక్కం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి మండల వార్డు మెంబర్స్ ఫోరం అధ్యక్షుడిగా చెవుల తిరుపతి ఎన్నిక

### వార్డు మెంబర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.. చెవుల తిరుపతిగీ

**పెద్దపల్లిటౌన్. అక్టోబర్ 11( విజన్ ఆంధ్ర)**
తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం పెద్దపల్లి మండల అధ్యక్షుడిగా చెవుల తిరుపతి ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నాగేబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు పెద్దపల్లి మండల అధ్యక్ష పదవికి నిర్వహించిన ఎన్నికల్లో చెవుల తిరుపతి భారీ మెజారిటీతో విజయం సాధించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు చెవుల తిరుపతి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు నాగేబెల్లి జ్యోతి మహేష్, జిల్లా ఇన్‌చార్జి మోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌కు ప్రత్యేక



కృతజ్ఞతలు తెలిపారు.మండల పరిధిలోని వార్డు మెంబర్లందరితో సమన్వయం చేసుకుంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వార్డు మెంబర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అధికారులతో సమన్వయం చేసుకుంటూ వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో వార్డు మెంబర్ల పాత్ర కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు కృషి



చేయాల్సిన అవసరం ఉందన్నారు. వార్డు మెంబర్ల హక్కుల పరిరక్షణతో పాటు, వారి సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిరంతరం పోరాడుతానని చెవుల తిరుపతి స్పష్టం చేశారు.తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి వార్డు మెంబర్ల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

# ఊరి ఊరికో జమ్మి చెట్టు..గుడికో జమ్మి చెట్టు.

### హనుమాన్ ఆలయంలో జమ్మి మొక్క నాటిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**బోయినిపల్లి అక్టోబర్ 11(విజన్ ఆంధ్ర):**
గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా బోయినిపల్లి మండల కేంద్రంలో శ్రీ హనుమాన్ ఆలయంలో జమ్మి మొక్కనాటిన బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య మరియు నాయకులు
రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల కేంద్రంలోనీ శ్రీ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించి గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా జమ్మి మొక్క నాటే కార్యక్రమాన్ని మాజీ రాజ్యసభ సభ్యులు,గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు జోగినిపల్లి సంతోష్ కుమార్ గారు చేపట్టిన"ఊరి ఊరికో జమ్మి చెట్టు--గుడి గుడికో జమ్మి చెట్టు" కార్యక్రమంలో భాగంగా స్థానిక బిఆర్ఎస్



పార్టీ ప్రధాన కార్యదర్శి నాయకులు గుంటి శంకర్ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో జమ్మి మొక్కను నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ప్రారంభించిన హరితహారం స్ఫూర్తితో,హరితహారానికి తోడుగా జోగినిపల్లి సంతోష్ కుమార్ గారు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించి పర్యావరణ పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నారని తెలిపారు.మన సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే జమ్మి చెట్టును ప్రతి గ్రామంలో,ప్రతి ఆలయంలో నాటాలనే సంకల్పంతో "ఊరి ఊరికో జమ్మి చెట్టు--గుడి గుడికో జమ్మి చెట్టు"కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళు న్నారని పేర్కొన్నారు.భావితరాలకు పచ్చని ప్రకృతిని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి,వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి కొనుకటి లచ్చిరెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, సర్పంచ్ అనుముల భాస్కర్,మెడుదుల మల్లేశం,సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అక్కనేపల్లి కర్ణాకర్,చిందం రమేష్,ఇడుగు స్వామి ముద్దం రవి,బోయినీ రాజు,నల్లగొండ అనిల్ కన్నం సాగర్,భీమనాథుని రమేష్,జంగిడి సంజీవ్,గూడా కిషన్,కట్ట లింగయ్య,బొజ్జ ప్రభాకర్,మల్లారపు చందు,గురజాల కోటి,దూస మధు,మహమ్మద్ హుసేన్ మరియు గ్రీన్ ఇండియాఛాలెంజ్ సభ్యులు కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలి: ఎమ్మెల్యే నాయిని..

### జ్యోతి ప్రజలన చేసి అధికారికంగా ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని దంపతులు..

హన్మకొండ న్యూస్ : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వారి సతీమణి నాయిని నీలిమ రెడ్డి తో పద్మాక్షి దేవాలయంలో అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి నవరాత్రి ఉత్సవాలను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే



నాయిని మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగిళ్ల పద్మనాభ అవధాని శంకర్ శర్మ వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద మంత్రాలతో ఆశీర్వచన అందజేసినారు ఇట్టి కార్యక్రమంలో పదో డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు దేవాలయ కార్యకర్తలు నీలారపు రాజకుమార్ ఆకుతోట సంతోష్ సదానందం కనుకుంట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

# అట్టహాసంగా ప్రారంభమైన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు.

**జూలపల్లి అక్టోబర్ 11.(విజన్ ఆంధ్ర )**



జూలపల్లి మండలంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం జూలపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి భవానీ యూత్, ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి అమ్మవారి పూజ ఏర్పాట్లు అంగరంగ వైభవంగా చేశారు. అలాగే , జూలపల్లి మండలంలోని తదితర గ్రామాల్లో మండపాల్లో దుర్గామాతలను ప్రతిష్టింపజేశారు. వేద పండితుల మంచోత్సవాల మధ్య అమ్మవార్లను ప్రతిష్ట చేశారు. గ్రామ ప్రజలు, పిల్లలు, యువత ,మహిళలు భారీ ఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు ఈపాటికి ఏర్పాటు చేశారు. అలాగే జూలపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి భవానీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలో గ్రామ ప్రజలు మరియు ప్రజా ప్రతినిధులు నాయకులు మహిళలు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు

# ముత్యంపేటలో వైభవంగా దుర్గాదేవి ఆగమనం

### భక్తిపారవశ్యంతో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**మల్యాల, అక్టోబర్ 11(విజన్ ఆంధ్ర):**



మల్యాల మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందడి అంబరాన్నంటింది. మండల పరిధిలోని ముత్యంపేట గ్రామంలో ఆదివారం దుర్గాదేవి ఆగమన మహోత్సవాన్ని గ్రామస్తులు, భక్తులు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శోభాయాత్రలో భక్తుల కోలాహలం మిన్నంటింది. కళాకారుల డప్పు వాయిద్యాలు, యువత నృత్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు వైభవంగా సాగింది. గ్రామ మహిళలు దారిపొడవునా మంగళహారతులు పడుతూ జగన్మాతకు ఘన స్వాగతం పలికారు.ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు మేడిపల్లి సత్యం హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.